RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 10 సంచిక : 363 సోమవారం 04 - 08 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది



- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ
- రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన వైనం
- తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ విస్మరించారని తీవ్ర విమర్శ
- నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి, పొరుగు రాష్ట్రానికి లబ్ధి చేకూర్చేలా కేసీఆర్ వ్యవహరించారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయి, వాటిని ఏపీ వాడుకోవచ్చు" అని గతంలో కేసీఆరే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణను పక్కనపెట్టి, రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని,

ఆయన మాటలతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

- మిగతా 2 లో

## బనకచర్లను అడ్డుకునేందుకు

# ఎంతవరకైనా వెళతాం

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుంటామన్న తెలంగాణ
- ఇది విభజన చట్టానికి విరుద్ధమంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాయలసీమకు నీటి తరలింపును సహించేది లేదని స్పష్టీకరణ
- అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని వెల్లడి
- గోదావరిపై కొత్త ప్రాజెక్టులతో హక్కులు కాపాడుకుంటామని హామీ



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుని తీరుతామని, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు ఎంతవరకైనా వెళతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి పూర్తిగా విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ఉద్దేశించిన బనకచర్ల ప్రాజెక్టును తమ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, దీనిని నిలువరించేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని ఆయన వివరించారు. ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ విషయంపై చర్చించామని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. గోదావరి నదిపై ఇచ్చంపల్లితో పాటు

- మిగతా 2 లో

## కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం




- ఆగస్టు 5న ఈసీతో సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్
- ఎన్నికల సంస్కరణలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చ
- బీఆర్ఎస్ పెండింగ్ వినతులపైనా చర్చించే అవకాశం
- ఓటర్ల జాబితా సవరణ వివాదం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

## ఇండియా కూటమి కీలక భేటీ

## రాహుల్ నివాసంలో నేతలకు డిన్నర్

- ఆగస్టు 7న రాహుల్‌గాంధీ నివాసంలో ఇండియా నేతల భేటీ- సమావేశ అజెండాపై సర్వత్రా ఉత్కంఠ
- జేడీయూ కూటమిని గెలిపించేందుకే బిహార్‌లో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను చేపట్టారని ఆయన ఆరోపించారు.



ఢిల్లీ : గత ఎన్నికల్లో 70 నుంచి 80 లోక్‌సభ స్థానాల్లో రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు చేసిన మరుసటి రోజే (ఆదివారం) మరో విషయం వెలుగులోకి వచ్చింది. లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ తన నివాసంలో ఆగస్టు 7న (గురువారం) రాత్రి విపక్ష ఇండియా కూటమి నేతలకు డిన్నర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పలు ముఖ్య అంశాలపై విపక్ష నేతలు చర్చిస్తారని సమాచారం. బిహార్‌లో ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ, మహారాష్ట్ర ఓటరు జాబితాలపై ఆరోపణలు, ఆపరేషన్ సిందూర్, భారత్ -

- మిగతా 2 లో

## గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు




- నాగ్‌పూర్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు
- ఫోన్ కాల్‌తో పోలీసులు అప్రమత్తం
- బాంబ్ స్క్వాడ్ తనిఖీలు.. నకిలీ కాల్‌గా నిర్ధారణ
- కాల్ చేసింది మద్యం షాపులో పనిచేసే వ్యక్తిగా గుర్తింపు

## ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు

# సేవలు అతి త్వరలో ప్రారంభం

- కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గనున్న ప్రయాణ సమయం
- గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న రైలు
- వేగంగా సాగుతున్న 508 కిలోమీటర్ల హై-స్పీడ్ రైల్ కారిడార్ పనులు



ఢిల్లీ : దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ రైలు సేవలను అతి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గిపోతుందని తెలిపారు. ఆయన ఇవాళ అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా-పుణె ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా

- మిగతా 2 లో

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి

## జగన్ లో ఫ్రస్టేషన్

- మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ పై మండిపడ్డ మంత్రి పార్థసారథి
- భయంతో దిగజారి మాట్లాడుతున్నాడని ఫైర్



- చంద్రబాబుపై ఆయన వ్యాఖ్యలే నిదర్శనం
- ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేశా కానీ ఇలాంటి రాజకీయం ఎప్పుడూ చూడలేదన్న మంత్రి
- గెలిచినా ఓడినా నాయకులు ప్రజా సమస్యలపై హుందాగా మాట్లాడేవారని వెల్లడి
- జగన్ ఇందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడని విమర్శ

అమరావతి : కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చూసి జగన్ లో ఫ్రస్టేషన్ పెరిగిపోయి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నాడని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. ఈ రోజు ఉదయం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న రాజకీయాలు, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్న తీరు, వారి విధ్వంసకర విధానాలు చూస్తుంటే రాజకీయ నేతగా చాలా బాధేస్తున్నదని మంత్రి చెప్పారు.

- మిగతా 2 లో

# బల్లికురవ గ్రానైట్ క్వారీలో ప్రమాదం..

- బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది.
- క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు.
- ప్రమాద సమయంలో క్వారీలో 16 మంది పనిచేస్తున్నట్లు సమాచారం.



బాపట్ల: జిల్లాలోని బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది. క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతిచెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్వారీలో 16మంది పనిచేస్తున్నట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన అధికారులు క్వారీలో సహాయక చర్యలు చేపట్టారు. బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగటం సర్వసాధారణం అయిపోయింది. క్వారీల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్వారీ ప్రమాదాలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఈ ఘటనపై విచారణ జరపాలి: సీఎం చంద్రబాబు

బల్లికురవ క్వారీ ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో పాటు మరి కొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

## పెట్టుబడులపై జగన్ అండ్ కోవి

## అసత్య ప్రచారం..




- ఏపీ అసెంబ్లీ సమావేశాలకు జగన్ రావాలని...
- వారి పార్టీ నేతలు లాగా తాము అవహేళనగా మాట్లాడమని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- రప్పా రప్పా భాష మాట్లాడమని చెప్పుకొచ్చారు.
- జగన్ నిర్భయంగా అసెంబ్లీకి రావాలని అక్కడ నిజాలు చెప్పాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

# సంపాదకీయం

## సిందూర్ విజయాలు, పాలకుల వైఫల్యాలు




పార్లమెంటు ఉభయ సభలలో గత వారం ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఆ సైనిక చర్య లక్ష్యాలు నెరవేరాయని, తత్కారణంగా దాన్ని తుదకు (తాత్కాలికంగా) విరమించడం జరిగిందని, మన సైనిక కార్యకలాపాలు సాధారణమైన క్రమ పద్ధతికి వచ్చాయనే అభిప్రాయాన్ని ప్రభుత్వం కలిగించింది. పరిస్థితి నిజంగా అలా ఉన్నదా? లేదు. ప్రభుత్వం కలిగించిన అభిప్రాయం తప్పు. నిజమేమిటంటే మన సైన్యం ఒక కఠినమైన ఆట ఆడుతుండగా ప్రభుత్వం బలవంతంగా బంతిని లాక్కోవడం జరిగింది! మన సైనిక దళాల ధైర్య సాహసాలకు జేజేలు. ఆపరేషన్ సిందూర్ కొన్ని కట్టుకథలను బద్దలుగొట్టింది. అపోహలు, తప్పుడు నమ్మకాలను తొలగించింది. పాకిస్థాన్‌పై యుద్ధం, విజయ సాధన చాలా సులభంబీ సంప్రదాయ యుద్ధంలో భారత్ ఆధిక్యత చెక్కు చెదరకుండా కొనసాగుతుందిబీ భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్ర దేశాలు ఉన్నాయి, పాకిస్థాన్‌కు శ్రేయోభిలాషులు ఎవరూ లేరు మొదలైనవే ఆ కట్టుకథలు.మన సైనిక దళాల నాయకత్వం విలక్షణరీతిలో వ్యవహరించింది. సైనిక చర్యలకు ఉదాహరణప్రాయంగా ఆపరేషన్ సిందూర్‌ను అవి నిర్వహించాయి. సైనిక కార్యాచరణ విషయంలో స్వేచ్ఛనివ్వాలని ప్రభుత్వాన్ని సైన్యం కోరింది. సైన్యం అభ్యర్థనను సర్కార్ అంగీకరించింది. సైనిక చర్యకు సంకల్పించింది, తొట్ట తొలుత రంగంలోకి దిగింది భారత సైన్యమే గనుక దానికి సహజంగానే ప్రారంభ సానుకూల ప్రయోజనాలు దక్కాయి: పాకిస్థాన్ భూభాగాలలోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది వేర్వేరు ఉగ్రవాద స్థావరాలపై కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలో చేసిన దాడులు సంపూర్ణంగా విజయవంతమయ్యాయి. ఉగ్రవాద కార్యకలాపాల సదుపాయాలు, సాధనాలు సమస్తమూ ధ్వంసమైపోవడంతో పాటు పలువురు ఉగ్రవాదులు హతులయ్యారు. అయితే పాకిస్థాన్ సైనిక దళాలు త్వరితగతిన కోలుకున్నాయి. చైనాలో తయారైన యుద్ధ విమానాలు చైనా ఉత్పత్తి చేసిన మిస్సైల్స్, తుర్కియే సరఫరా చేసిన డ్రోన్‌లతో మే 7-8 రాత్రి, పాకిస్థాన్ ప్రతిదాడులు నిర్వహించింది.తమ వ్యూహ సంబంధిత లోపాలు, లొసుగులను మన సైనిక దళాల నాయకత్వం వెన్వెంటనే గుర్తించి, కొత్త యుద్ధ తంత్రంతో పాకిస్థాన్‌ను ఎదుర్కొన్నది. అదీ సరైన, సమర్థ నాయకత్వం. పునః ప్రారంభమైన సైనిక చర్యలు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని 11 సైనిక వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సహజంగానే భారత సైన్యానికి కొన్ని నష్టాలు వాటిల్లాయి. అత్యున్నతస్థాయి సైనికాధికారులు ఈ వాస్తవాన్ని అంగీకరించారు. ఇది, సమర్థ నాయకత్వానికి మరొక ఉదాహరణ. మరి మన రాజకీయ నాయకత్వం కూడా సైనిక నాయకత్వం మాదిరిగా వ్యవహరించిందా? లేదు. తన తప్పులను అంగీకరించలేదు. నష్టాలు వాటిల్లినట్టు ఒప్పుకోలేదు (తలను ఇసుకలో దూర్చి తననెవరూ చూడటం లేదని భావించే) ఉష్ట్రపక్షిలా మన రాజకీయ నాయకత్వం వ్యవహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఒక 'నిర్ణయాత్మక విజయం' సమకూరిందని పదే పదే ప్రకటించింది. నిజమేనా? నిర్ణయాత్మక విజయం సమకూరి ఉన్నట్టయితే తనకు సానుకూలంగా ఉన్న పరిస్థితులను మరిన్ని సైనిక విజయాల సాధనకు ఎందుకు ఉపయోగించుకోలేదు? పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి రాజకీయ రాయితీలను డిమాండ్ చేసి ఎందుకు పొందలేదు? పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ఫోన్ చేసీ చేయగానే ఎందుకు సానుకూలంగా ప్రతిస్పందించారు? కాల్పుల విరమణకు షరతులు ఎందుకు విధించలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవు (యుద్ధంలో ఒక నిర్ణయాత్మక విజయానికి తిరుగులేని ఉదాహరణ డిసెంబర్ 16, 1971న పాకిస్థాన్ సైనికాధికారి జనరల్ నియాజీ భారత సైనికాధికారి జనరల్ అరోరాకు లొంగిపోవడం).ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నెలకొన్న ఒక వాస్తవాన్ని మన రాజకీయ నాయకత్వం అంగీకరించలేదు: పాకిస్థాన్, చైనాలు తమ సైనిక, రాజకీయ సంబంధాలను మరింతగా పటిష్ఠం చేసుకున్నాయి. పాకిస్థాన్‌కు కొత్త తరం యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ను చైనా సరఫరా చేస్తోంది. తాము ఉత్పత్తి చేసిన సైనిక సామగ్రి మన్నికను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనా పరీక్షించుకున్నది. బీజింగ్%-%ఇస్లామాబాద్ సైనిక బంధం ఆపరేషన్ సిందూర్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి 'ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిశ్చయాత్మక చర్య'ను ప్రశంసించారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు చైనా సంపూర్ణ మద్దతునిచ్చింది.అమెరికాతో పాకిస్థాన్ (కనీసం పాకిస్థాన్ సైన్యం) బంధం మరింతగా దృఢతరమవడం మరొక వాస్తవం. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌ను అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందుకు ఆహ్వానించారు. దేశ సార్వభౌమాధినేత లేదా ప్రభుత్వాధినేత కాని వ్యక్తులకు మున్నెన్నడూ ఇటువంటి గౌరవం లభించలేదు. 'యుద్ధాన్ని కొనసాగించకుండా, ముగించినందుకు జనరల్ మునీర్‌కు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పారు. తన విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్‌లు అంగీకరించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. ఆపరేషన్ సిందూర్ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలను ప్రధానమంత్రి, హోం మంత్రి ఘాటుగా విమర్శించారే గానీ అమెరికా, చైనా అధ్యక్షులు, వారి విదేశాంగ మంత్రుల ప్రకటనలను ఖండించే సాహసం చేయలేకపోయారు. ప్రతిపక్షాల విమర్శలు నిరాధారమైనవని ఎందుకు నిరూపించలేకపోయారు? అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిక్యతకు పోటీపడుతున్న అమెరికా, చైనాలు పాకిస్థాన్‌ను సైనికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకోవడంలో ఒకే విధంగా వ్యవహరించాయన్నది మరొక విస్మరించలేని వాస్తవం. ఈ రెండు దేశాలు తమ విభేదాలు విస్మరించి పాకిస్థాన్‌కు మద్దతునిచ్చేందుకు, ప్రోత్సహించేందుకు అంగీకరించాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే పహల్గాం దాడిలో పాకిస్థాన్ ప్రమేయాన్ని చాటి చెప్పేందుకు ప్రపంచ దేశాలకు భారత ప్రభుత్వం పంపిన దౌత్య ప్రతినిధుల బృందాలు తమ లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించలేక పోయాయి. ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని, భారత్‌కు సానుభూతిని వ్యక్తం చేశాయేగానీ ఆ దుర్మార్గానికి పాకిస్థాన్‌దే బాధ్యత అని ఏ ఒక్క దేశమూ ఖండించనేలేదు. ఈ వాస్తవాలను అంగీకరించేందుకు భారతదేశ రాజకీయ నాయకత్వం తిరస్కరిస్తోంది. పాకిస్థాన్‌కు మిత్ర దేశాలు లేవని, భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా మిత్రులు ఉన్నారనే భ్రమలోనే ఇప్పటికీ ఉన్నది! జమ్మూ%-%కశ్మీర్‌లో ఉగ్ర ఆవరణం (టెర్రర్ ఎకోసిస్టమ్ %-% ఉగ్రవాద ఆవిర్భావం, వ్యాప్తి, నిలకడకు దోహదం చేసే పరస్పర అనుసంధానిత కారకాల సంక్లిష్ట వ్యవస్థ) ధ్వంసమై పోయిందనే భ్రమలో కూడా దేశ రాజకీయ నాయకత్వం ఉన్నది. సత్యం భిన్నంగా ఉన్నది, సందేహం లేదు. పహల్గాం ఉగ్రదాడి (ఏప్రిల్ 22, 2025) సంభవించిన రెండు రోజుల అనంతరం (ఏప్రిల్ 24) ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ ఈ క్రింది వివరాలు వెల్లడించింది: జూన్ 2014%-% మే 2024 మధ్య కశ్మీర్‌లో 1643 ఉగ్రవాద సంఘటనలు, 1925 చొరబాటు ప్రయత్నాలు, 726 సఫల చొరబాట్లు సంభవించాయిబీ 576 మంది భద్రతా సిబ్బంది హతమయ్యారు. అటల్ బిహారీ వాజపేయి (1998%-%2004), మన్మోహన్‌సింగ్ (2004%-%2014) ప్రధాన మంత్రిత్వాల కాలంలో కూడా ఉగ్రవాద దాడులు సంభవించాయి, హతులు, క్షతగాత్రులు గణనీయంగా ఉన్నారు.ఉగ్ర ఆవరణంలో ఉన్నదెవరు? పాకిస్థాన్ నుంచి భారత భూభాగాల్లోకి చొరబడినవారు, భారత్‌లో, ముఖ్యంగా కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నవారు. ఈ రెండు వర్గాలవారు తరచు కలిసికట్టుగా పనిచేస్తున్నారు, కలిసికట్టుగా ఉగ్ర చర్యలకు పాల్పడుతున్నారు, పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. ఏప్రిల్ 26, 2025న ప్రభుత్వం కశ్మీర్ లోయలో పలు గృహాలను కూల్చి వేసింది. 'పహల్గాం ఊచకోతతో సంబంధమున్న ఉగ్రవాదులు' అని అనుమానించిన వారి గృహాలను కూల్చివేసినట్టు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కూల్చివేతకు గురైన గృహాల యజమానులు భారతదేశానికి చెందిన ఉగ్రవాదులే. జూన్ 2025లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారికి ఆశ్రయమిచ్చినందుకు ఇద్దరు భారతీయులను అరెస్ట్ చేసింది. జూలై 27%-%28న ఉగ్రవాదులు అని శంకిస్తున్న వ్యక్తులను నిరాయుధులను చేసి, వారు చొరబాటుదారులు అని గుర్తించారు. భారతదేశానికి చెందిన ఉగ్రవాదులు గతంలో ఉగ్రవాద హింసాకాండకు పాల్పడ్డారు. 2006లో ముంబై సబర్బన్ రైలులో బాంబు పేలుళ్ళు, 2008లో తాజ్‌మహల్ హోటల్‌పై దాడి, 2011లో జావేరీ బజార్ ఘటన సదరు ఉగ్రవాద హింసాకాండకు ఉదాహరణలు. 2006 ఉగ్రవాద దుర్మార్గానికి పాల్పడింది భారత్‌కు చెందిన ఉగ్రవాదులే. 2008 ఘటనకు పాల్పడినవారు కసబ్‌తో సహా పది మంది పాకిస్థానీ చొరబాటుదారులు. 2011 ఘటన భారత్‌కు చెందిన ఉగ్రవాదుల క్రూర కృత్యమే. భారత్‌లో ఉగ్ర ఆవరణాన్ని (టెర్రర్ ఎకోసిస్టమ్) నిర్మూలించినట్టు ప్రభుత్వం చేస్తున్న వాదన నిస్సందేహంగా తప్పు. ప్రభుత్వ వాదన నిజమే అయితే పహల్గాం దాడి ఎలా సంభవించింది? గూఢచార వర్గాల వైఫల్యం, పహల్గాంలో భద్రతా దళాలు లేకపోవడం వల్లే ఏప్రిల్ 22న ఆసేతు హిమాచలం ప్రతి ఒక్కరినీ కలచివేసిన బీభత్స విషాదం చోటుచేసుకున్నది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఏ ఒక్కరూ ఆ అమానుష హింసాకాండకు బాధ్యత తీసుకోలేదు. ఇది గర్హనీయం కాదా? పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహసాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత్ రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసించవచ్చు.

# కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి జగన్ లో ఫ్రస్టేషన్

మొదటి పేజి తరువాయి

రాజకీయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చిన తనకు మూడు దశాబ్దాల అనుభవం ఉందని గుర్తుచేస్తూ.. నాలుగైదు దశాబ్దాల నుంచి రాజకీయాలను చాలా దగ్గరి నుంచి చూస్తున్నానని తెలిపారు. అయితే, వైసీపీ నేతలు వ్యవహార తీరును తాను ఏనాడూ చూడలేదని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎంత ఘాటుగా విమర్శించినా కూడా ఎక్కడా ఎవరూ వ్యక్తిగత దూషణలకు పాల్పడలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. నేతలను కించపరిచేలా మాట్లాడటం, అప్రజాస్వామికంగా మాట్లాడటం ఎక్కడ కూడా తాను చూడలేదన్నారు. అధికార పక్షాన్ని కించపరచడం కోసం అరాచక శక్తులని ప్రోత్సహించడం ఎప్పుడూ చూడలేదన్నారు. హుందాగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలే ప్రాధాన్యంగా పోరాటాలు చేసేవారని చెప్పారు. ఈరోజు వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్ తీరు చూస్తుంటే చాలా బాధేస్తుందని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. గెలుపు ఓటములు సర్వసాధారణం కానీ గెలిచినా ఓడినా నైతిక రాజకీయాలు చేయాల్సిన బాధ్యత ప్రతీ రాజకీయ నేతపై ఉందన్నారు. బహుశా వైనాట్ 175 నుంచి 11 స్థానాలకు పడిపోవడం మూలంగా జగన్ ఈ విధంగా అనైతికంగా, అప్రజాస్వామికంగా విధ్వంసకర పరిస్థితులను ప్రోత్సహించే విధంగా ప్రవర్తిస్తున్నారు అనిపిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి క్రిందిస్థాయి నాయకులకు ఆదర్శంగా ఉండాలని మంత్రి పార్థసారథి హితవు పలికారు. జగన్ పర్యటనలు చూసినా, ఆయన ఉపన్యాసాలు చూసినా ఆయన పత్రికా ప్రకటనలు చూసినా ఆయనలో ఒక ఫ్రస్టేషన్ కనపడుతుందని మంత్రి చెప్పారు. ఆయనలో ఏదో ఒక అభద్రతా భావం కనపడుతుందన్నారు. మాటల్లో నియంత్రణ కోల్పోవటం, వ్యక్తిగత దూషణలకి దిగటం జగన్ కు పరిపాటైందన్నారు. తాను ముగ్గురు ముఖ్యమంత్రుల దగ్గర పనిచేశానని, ప్రస్తుతం చంద్రబాబు దగ్గర మంత్రిమండలిలో ఉన్నానని చెప్పారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు.. ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి కానివ్వండి, రోశయ్య కానివ్వండి కిరణ్ కుమార్ రెడ్డి కానివ్వండి ఎవరైనా సరే.. నాలాంటి మంత్రులు ఎవరైనా అప్రజాస్వామికంగా మాట్లాడినా లేకపోతే ఏదైనా భాష సరిగ్గా లేకున్నా కూడా మందలించేవాళ్ళని చెప్పారు. కానీ మమ్మల్ని ఎక్కడా తిట్టమని ప్రోత్సహించలేదని వివరించారు. ప్రస్తుతం చంద్రబాబు కూడా కక్షపూరిత రాజకీయాలు మనకు వద్దని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా మీ మీ ఆలోచనలకి పదును పెట్టాలని చెబుతారని మంత్రి వివరించారు.

గంజాయికి బానిసై సమాజంలో అరాచకాలు సృష్టిస్తూ ఆడపిల్లల్ని హింసిస్తున్న వారి మీద పోలీసులు చర్యలు తీసుకుంటే జగన్ వెళ్లి వారిని పరామర్శిస్తున్నాడని మంత్రి మండిపడ్డారు. శాసన సభ్యురాలిగా ఉన్న ఒక సోదరిని నీచాతి నీచంగా దిగజారి మాట్లాడితే అతన్ని మందలించాల్సింది పోయి పరామర్శిస్తున్నాడంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. మహిళల పట్ల జగన్ కు ఉన్న గౌరవం ఏమిటో ఈ ఘటనే చెబుతుందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఆమోదయోగ్యమైన భాష మాట్లాడితే తప్పులేదు. కానీ చాలా అనైతికంగా, దిగజారుడుతనంగా మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ఇటువంటి భాషని వాడే మీరందరూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం గురించి మాట్లాడడం వేరు, సంక్షేమం చేసి చూపించడం వేరని మంత్రి చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వంలో అందే సంక్షేమం కొత్త చరిత్రను తిరగరాస్తోందని, గతంలో ఏ ప్రభుత్వాలు ఇవ్వని స్థాయి సంక్షేమాన్ని నేడు ప్రజలు అందుకుంటున్నారని మంత్రి చెప్పారు. జగన్ లో ఫ్రస్టేషన్ కు ఇది కూడా కారణం కావచ్చని ఎద్దేవా చేశారు. ప్రజల్లో అన్ని వర్గాల్లో పాజిటివ్ వస్తే తన పరిస్థితి ఏమీ మిగలదు అని ఇలా వ్యవహరిస్తున్నాడు అనిపిస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. 'దేశంలో నెలకు 64 లక్షల మందికి రూ.2720 కోట్లు పింఛన్లు ఇచ్చే ప్రభుత్వం మరొకటి ఉందా? ఈ నెలతో కలిపి దగ్గర దగ్గర రూ. 40 వేల కోట్లు కేవలం పింఛన్లపై ఖర్చు చేశాం. ఇది కాదా సంక్షేమం? తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ ఆర్థిక సాయం చేశాం. దీనికి దాదాపు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశాం. నాకు డబ్బులు పడలేదు అని ఎవరూ చెప్పే పరిస్థితి లేకుండా చేశాం. దీన్ని ఏమంటారు? 204 అన్న క్యాంటీన్లు పెట్టాం.... ఇప్పటికి 4 కోట్లమందికి పైగా భోజనాలు చేశారు. అంటే జగన్ భాషలో పేదల కడుపునింపడం సంక్షేమం కాదా? 47 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లో దాదాపు రూ.3200 కోట్లు వారి అకౌంట్లో జమ చేశాం .....ఇది రైతు సంక్షేమం కాదా? ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నాం. జగన్ కళ్లు మూసుకుని సంక్షేమం లేదు అని పదే పదే గోల పెట్టి... అదే నిజం అని చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.... పోలీస్ రిక్రూట్ మెంట్ చేస్తున్నాం...పెట్టుబడుల తెచ్చి మళ్లీ పారిశ్రామిక రంగంలో ఊపు తెచ్చాం. ఇవన్నీ కనిపించడంలేదా ?ప్రతి వర్గానికి సాయంగా నిలుస్తున్నా.. ఉచిత ఇసుక తెచ్చి నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు పోరాటాలు చేయాలి. ప్రభుత్వాలను పశ్నించాలి. ప్రజల కోసం పనిచేయాలి. కానీ జగన్ కు తన సొంత ఉనికి, ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టవు. ఇలాంటి రాజకీయ పార్టీలు చరిత్రలో మనుగడ సాగించలేదు.. జగన్ యాక్సిడెంటల్ చీఫ్ మినిస్టర్ గా చరిత్రలో నిలిచిపోతారు ప్రజలు కూడా ఇలాంటి వారి పట్ల చైతన్యంతో ఉండాలి. మంచి చెడు చూడాలి' అని మంత్రి పార్థసారథి చెప్పారు.

# ఇండియా కూటమి కీలక భేటీ
# రాహుల్ నివాసంలో నేతలకు డిన్నర్

మొదటి పేజి తరువాయి

అమెరికా వాణిజ్య ఒప్పందం, భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తాను తప్పకుండా ఆగస్టు 7న జరిగే ఇండియా కూటమి సమావేశానికి హాజరవుతానని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నేత ఫరూఖ్ అబ్దుల్లా శనివారం రోజ్జే వెల్లడించారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమిని గెలిపించేందుకే బిహార్‌లో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను చేపట్టారని ఆయన ఆరోపించారు. ఈ అంశాలను సమావేశంలో తాను ప్రస్తావిస్తానన్నారు. బిహార్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న వాళ్లనే తిరిగి గెలిపించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారని ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. తనకు కూడా రాహుల్ గాంధీ నుంచి పిలుపు వచ్చిందని, ఆగస్టు 7న జరిగే సమావేశానికి హాజరవుతానని సీపీఐ నేత డీ రాజా చెప్పారు. సమావేశ ఎజెండా ఏమిటనేది ఇంకా తెలియదన్నారు. త్వరలోనే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

### ఆ అంశాలపై ఈసీ సమాధానాలు చెప్పాలి : ప్రియాంకా చతుర్వేది

బిహార్‌లో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్రలో లక్షలాది ఓటర్ల చేరికతో ముడిపడిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సమాధానాలు రావాల్సి ఉందని శివసేన (ఉద్ధవ్) నాయకురాలు ప్రియాంకా చతుర్వేది అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో 45 లక్షల మంది ఓటర్లను ఎలా చేర్చారు? చివరి గంటలో ఓటరు జాబితాల నుంచి 70 లక్షల మంది ఓటర్లను ఎలా తొలగించారు? అనే ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పాలని ఆమె కోరారు. ఈ అంశాలను ఆగస్టు 7న రాహుల్ గాంధీ నివాసంలో జరిగే భేటీలో ప్రస్తావిస్తామన్నారు. బిహార్‌లో ఓటరు జాబితాల నుంచి ఓటర్ల పేర్లను ఎందుకు తొలగిస్తున్నారు? బిహార్‌కు చెందిన వలస కూలీల ఓట్లకు ఎందుకు ఎసరు పెడుతున్నారు? అనే అంశాలపై క్లారిటీ రావాల్సి ఉందని ప్రియాంకా చతుర్వేది చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి సహా ఏ అంశంపైనా జవాబుదారీగా పార్లమెంటుకు బదులిచ్చేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధపడటం లేదన్నారు. భారత ప్రజల రక్తాన్ని పణంగా పెట్టి, కేవలం డబ్బుల కోసం పాకిస్థాన్‌తో టీమిండియా క్రికెట్ మ్యాచ్‌లకు మోదీ అనుమతించడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ వల్ల చోటుచేసుకున్న రక్తపాతాన్ని మరువరాదన్నారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఇండియా కూటమి భేటీ కానుండటం ఇది రెండోసారి. జులై 19న జరిగిన కూటమి వర్చువల్ సమావేశంలో దాదాపు 24 మంది పాల్గొన్నారు. హాజరైన నేతల్లో శరద్ పవార్ (ఎన్‌సీపీ - ఎస్‌పీ), తేజస్వి యాదవ్ (ఆర్‌జేడీ), జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్, శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే తదితరులు ఉన్నారు. కాగా, శనివారం రోజు రాహుల్ గాంధీ సంచలన కామెంట్స్ చేశారు. కర్ణాటకలోని ఒక లోక్‌సభ స్థానంలో మొత్తం 6.50 లక్షల మంది ఓటర్లు ఉండగా, 1.50 లక్షల మంది ఫేక్ అని తమ పార్టీ గుర్తించిందని ఆయన వెల్లడించారు. ఆధారాలు ఉండబట్టే దీనిపై ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నానని చెప్పారు.

# బల్లికురవ గ్రానైట్ క్వారీలో ప్రమాదం

మొదటి పేజి తరువాయి

క్వారీలో పనులు చేస్తున్న కార్మికులపై రాళ్లు పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారని అన్నారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

### ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది: మంత్రి నారా లోకేష్

బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రమాదంలో రోజువారీ కూలీలు మృతిచెందడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యసాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి నారా లోకేష్ తెలియజేశారు.

బల్లికురవ క్వారీ ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఏపీ ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ కలెక్టర్‌కు సూచించామని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు.

### క్వారీ ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

బాపట్ల జిల్లాలో గ్రానైట్ క్వారీ ప్రమాదంపై మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో రాయిపడి ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రులు సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

### బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర..

బల్లికురవ క్వారీ ప్రమాదంపై మంత్రి కొల్లు రవీంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రమాదంపై తక్షణమే విచారణ జరిపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

# గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు...

ఢిల్లీ : కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో తీవ్ర కలకలం సృష్టించింది. ఆదివారం ఓ ఆగంతకుడు ఫోన్ చేసి, గడ్కరీ ఇంట్లో బాంబు పెట్టినట్టు బెదిరించాడు. ఈ సమాచారంతో నగర పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు అప్రమత్తమై, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. హుటాహుటిన గడ్కరీ నివాసానికి చేరుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇంటి ఆవరణతో పాటు లోపల కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి అంగుళాన్ని జల్లెడ పట్టినా ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇది కేవలం ఓ ఆకతాయి చేసిన నకిలీ కాల్ అని నిర్ధారణకు వచ్చారు. మరోవైపు, ఈ బెదిరింపు కాల్‌ను పోలీసులు చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన క్రైమ్ బ్రాంచ్ బృందాలు కొద్ది వ్యవధిలోనే నిందితుడి ఆచూకీని కనుగొన్నాయి. నాగ్‌పూర్‌లోని తులసి బాగ్ రోడ్డులో ఉన్న ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉమేష్ విష్ణు రౌత్‌గా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడు ఎందుకు ఈ బెదిరింపు కాల్ చేశాడనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు సేవలు అతి త్వరలో ప్రారంభం

మీడియాతో మాట్లాడుతూ, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి గుజరాత్‌లోని వాపి, సూరత్, వడోదర, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ 508 కిలోమీటర్ల పొడవైన హై-స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు. గుజరాత్‌లో చేపట్టనున్న మరిన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి కూడా అశ్విని వైష్ణవ్ ప్రస్తావించారు. పోర్‌బందర్-రాజ్‌కోట్ మధ్య కొత్త రైలు, రణవావ్ స్టేషన్‌లో రూ.135 కోట్లతో కోచ్ మెయింటెనెన్స్ కేంద్రం, పోర్‌బందర్‌లో రైల్వే ఫ్లైఓవర్, రెండు గతి శక్తి కార్గో టెర్మినళ్లు వంటివి రానున్నాయని వెల్లడించారు. గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 34,000 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాకులు వేశామని, ఇది రోజుకు సగటున 12 కిలోమీటర్లతో సమానమని ఆయన గుర్తుచేశారు. రైళ్ల రాకపోకలను నిలిపివేయకుండానే 1,300 రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం భారత రైల్వే చరిత్రలో అపూర్వమైన ఘట్టమని కొనియాడారు. వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ వంటి ఆధునిక రైళ్లను ప్రవేశపెట్టామని, తక్కువ ధర టిక్కెట్లతో అత్యాధునిక సౌకర్యాలున్న 8 అమృత్ భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆయన అన్నారు. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా డబుల్ ఇంజన్ ప్రభుత్వాల సహకారంతో రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని అశ్విని వైష్ణవ్ వివరించారు.

# కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి వెళ్లనుంది. రాజకీయ పార్టీలతో ఈసీఐ నిర్వహించనున్న ఈ భేటీ ఆగస్టు 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ అధికారికంగా లేఖ పంపారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కూడా బీఆర్ఎస్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. కేటీఆర్ నాయకత్వంలోని ఈ బృందంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండనున్నారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) వంటి కీలక అంశాలపై చర్చ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ గతంలో ఇచ్చిన వినతులు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) డ్రైవ్‌పై వివాదం నడుస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. ఇదే అంశంపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తూ, చర్చకు పట్టుబడుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై ఆగస్టు 5న బెంగళూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ బృందం ఈసీఐ సమావేశానికి హాజరుకావడం ఆసక్తికరంగా మారింది.

# బనకచర్లను అడ్డుకునేందుకు ఎంతవరకైనా వెళతాం

ఇతర కొత్త ప్రాజెక్టులను నిర్మించి, గోదావరి బేసిన్‌లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళితే, దానిని కచ్చితంగా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో ఈ నెల 30న ప్రజాభవన్‌లో ఒక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## నిరాశ్రయులు, అనాధలకు దుప్పట్లు, దుస్తులు, ఔషధాలు పంపిణి



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:** హైదరాబాద్ మహానగరంలో రోడ్ల పక్కన ఫుట్పాత్ల మీద జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారికి దుస్తులు, దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణి చేసి వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఔషధాలను అందించాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవాసభ్యులు పాల్గొన్నారు.

## కుంజ దశరథం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గా నియామకం



**కొత్తగూడ తెలంగాణ సేన.** :కాంగ్రెస్ పార్టీ ముష్మి గ్రామ కమిటీ అధ్యక్షులుగా కుంజ దశరథం ను తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క వారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య నియామకం చేశారు. నాపై నమ్మకంతో నాకు గ్రామ కమిటీ అధ్యక్షులుగా నియమించిన మండల పార్టీ అధ్యక్షులు వజ్జ సారన్న కు మంత్రి సీతక్కకు రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి కి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి కి ,లావణ్య వెంకన్న , బానోత్ రూఫ్ సింగ్ కు ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్ కు గ్రామ కమిటీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల పంపిణీ..

- మంత్రులకు స్వాగతం పలికిన వోడితల ప్రణవ్

- రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ









**తెలంగాణ సేన :** హుజురాబాద్ ప్రతినిధి ఆగస్టు 03బీ కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో చరిత్రలో ఎన్నడూ లేని రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని,పదేళ్ల నిరీక్షణకు 18 నెలల్లో పరిష్కారం చూపించామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున మానకొండూర్ నియోజకవర్గంలోని శంకరపట్నం మండలంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు పొన్నం,జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులకు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు ప్రణవ్.ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండాలని నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియా ప్రారంభించిందని ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమని అన్నారు.సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందజేస్తామని తెలిపారు.

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగని కలిసిన టీజేయు అధ్యక్షులు గుడాల చంద్ర శేఖర్



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షుడు గుడాల చంద్రశేఖర్ గుప్తా. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నారని, వారి వల్ల ప్రజా సమస్యలు దృష్టికి వెళ్లి సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారని కొనియాడారు. గజ్వేల్ నియోజకవర్గం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా గుడాల చంద్రశేఖర్ గుప్తకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రత్యేక యాత్రా ప్యాకేజీ బస్సు ద్వారా వచ్చి రాజన్నను దర్శించుకున్న భక్తులు



**వేములవాడ,ఆగస్టు 03 (తెలంగాణ సేన) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) ద్వారా ఏర్పాటు చేయబడిన ప్రత్యేక యాత్రా ప్యాకేజీ బస్సు శ్రావణమాసం పురస్కరించుకొని దక్షిణ కాశీ అయిన వేములవాడ పుణ్యక్షేత్రానికి రావడం జరిగింది. ఈ యాత్ర ప్యాకేజీ ద్వారా హైదరాబాద్ బస్ డిపో,మియాపూర్ డిపో ల నుంచి ఈ బస్సులు నిత్యయాత్రలుగా పుణ్యక్షేత్రాలైన కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలకు బయలుదేరుతాయని, ప్రతి రోజు ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రానికి తిరిగి నగరానికి చేరుకుంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పుణ్య క్షేత్రాలకు భక్తుల రద్దీ పెరుగుతున్న తరుణంలో సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలుపుతూ భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొనగలరని,ఆర్టీసీ వారు ఇలాంటి ఏర్పాట్లు చేయడం అత్యంత సంతోషదాయకం అని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రాధా భాయి పేర్కొన్నారు.ం

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలి



**కొత్తగూడా తెలంగాణ సేన :** కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థుల గెలుపుకై కృషి చెయ్యాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప పిలుపునిచ్చారు.కొత్తగూడ మండల కేంద్రం లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల కు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వపథకాలు వివరిస్తూ మండల కేంద్రం లోని వర్తక,వ్యాపార సంస్థల వారికీ మరియు ప్రజలకు పంపిణీ చేశారు. నరేంద్ర మోదీ గారి నాయకత్వం లో దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామ స్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని నేడు గ్రామాల్లో సీసీ రోడ్లు,ఉచిత బియ్యం,మరుగుదొడ్లు,యూరియా సబ్సిడీ ఉచిత గ్యాస్,ముద్ర యోజన, విశ్వకర్మ యోజన, ఇలా అనేక పథకాలు లబ్ధిదారులకు అందిస్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బోనాల ప్రవీణ్ చారి, బీజేపీ గిరిజన మోర్చా వనభందు సెల్ రాష్ట్ర కన్వీనర్ బోడ. నవీన్ నాయక్,సీనియర్ నాయకుడు తోటకూరి మధు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొట్టె శ్రీనివాస్,సీనియర్ నాయకులు బానోత్ హరిలాల్, తుపాకుల పరుశురాం,గుగులోత్ రూప్లా నాయక్,చేవ్వ రాంచందర్, వాసు,గంగాపురపు బిక్షపతి, బోడ సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో అంజన్ కుమార్ యాదవ్ ప్రత్యేక భేటీ"



**తెలంగాణ సేన న్యూస్/** జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని రహమత్ నగర్ డివిజన్లో ఎస్.పి.ఆర్.హిల్స్ లోని రెండు బొమ్మల వద్ద దశాబ్దాల కాలం నుండి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నటువంటి నిఖార్సైన సీనియర్ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలందరని ఛాయ్ పే చర్చా అనే కార్యక్రమంతో గౌరవ అంజన్ కుమార్ యాదవ్ సికింద్రాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కార్యకర్తలందరితో మాట- ముచ్చట కలిపి కార్యకర్తల మంచి చెడులను తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని రహమత్ నగర్ డివిజన్లో ఇన్చార్జీలు,మినిస్టర్లు, ఛైర్మన్లు,రహమత్ నగర్ డివిజన్లో పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశాలను బి.ఆర్.ఎస్. నుండి కాంగ్రెస్లో చేరినటువంటి వారితోనే నిర్వహిస్తూ కనీసం దశాబ్దాల కాలం నుండి పార్టీకి పనిచేసినటువంటి సీనియర్ నాయకులను కార్యకర్తలను సంప్రదించకుండా సమావేశాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి నాయకుల వైఖరిని గమనించినటువంటి అంజన్ కుమార్ యాదవ్ డివిజన్లో సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలను నాయకులను కలిసి మీకు అండగా నేనున్నాను ఏళ్ల తరబడి పార్టీకి పనిచేసిన వాళ్లను పక్కనపెట్టి నిన్న మొన్న పార్టీలో చేరిన వాళ్లతో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలు, మినిస్టర్లు బూత్ కమిటీ సమావేశాలు ఇతర కార్యక్రమాలు నిర్వహించడం చాలా బాధాకరం. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి కార్యకర్తలందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని,నిన్న మొన్న పార్టీలో చేరిన వారు,అర్హత లేని వారు కూడా ఇష్టానుసారంగా అభ్యర్థిని నేనంటే నేనని పలు సోషల్ మీడియా మాధ్యమాలలో ప్రచారాలను చేసుకుంటు,పార్టీ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వారు పద్ధతి మార్చుకోవాలని అంజన్ కుమార్ గారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎవరిని అభ్యర్థిగా నియమిస్తే వారికి మనమందరం కలిసి సమిష్టిగా పనిచేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కార్యకర్తలందరికీ అంజన్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తనకు మూడు దశాబ్దాల నుండి తెలుసని డివిజన్లో పాత కాంగ్రెస్ నాయకులు ఎవరు కొత్తగా పార్టీలో చేరి డ్రామాలు చేసేవారు ఎవరు అనేది తనకు క్లుప్తంగా తెలుసని,ఏళ్లతరబడి నిజాయితీగా పార్టీకి సేవలు అందించిన నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ పదవులను త్వరలోనే అందజేసి కార్యకర్తలను గౌరవించుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండపల్లి భవాని శంకర్ గారు (కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్ రహమత్ నగర్ డివిజన్-102/ నగర కాంగ్రెస్ పార్టీ (ప్రధాన కార్యదర్శి),యడవల్లి వెంకటస్వామి (%చీూఖ×% రాష్ట్ర అధ్యక్షులు), గ్యార నాగరాజు, (డివిజన్ కాంగ్రెస్ కమిటీ (ప్రధాన కార్యదర్శి) సాయి సూరజ్,(యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జూబ్లీహిల్స్),ఎస్.శివ (డివిజన్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు),సువర్ణమ్మ , మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యాదయ్య పాషా,అరుణ్ గౌడ్,శ్రావణ్ గౌడ్ గారు,బెన్వర్,సుందర్ రాజు, ఏసుదాసు ,మార్టిన్ ,సతీష్, బాబా విజయ్,వెంకటేష్ ,దిలీప్, ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చల్ల నారాయణరెడ్డి అనే నేను..



**కొత్తగూడ తెలంగాణ సేన :** మండలంలోని సాదిరెడ్డిపల్లికి చెందిన చల్ల నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో గత 40 ఏళ్లుగా కార్యకర్తగా పనిచేస్తూ పార్టీని బలోపేతం చేస్తూ.. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయిగా కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టి ప్రశంసలు పొందారు. సొసైటీ డైరెక్టర్ నుండి చైర్మన్ గా పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఉన్నత పదవులు పొంది నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం లో ... ఎన్నికల సమయంలో వారి కష్టం అజరామరం వారి సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ అనసూయ సీతక్క.. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ వారి ఆదేశాల మేరకు.. రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ తెలంగాణ కు అధికారికంగా నియమించారు నేడు ములుగు అసెంబ్లీ మహబూబాబాద్ జిల్లా స్థానిక కొత్తగూడ మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పత్రిక ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం నిర్వహించి చల్ల నారాయణరెడ్డి వారు మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో నా సేవలను గుర్తించి నాకు ఉన్నత స్థాయిలో అధికారికంగా రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ గా నియమించినందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మా అక్క సీతక్క రాష్ట్ర క్యాబినెట్ మంత్రికి ములుగు %డ% మహబూబాబాద్ జిల్లా ల అధ్యక్షులకు అన్ని మండల పార్టీ అధ్యక్షులకు.. బ్లాక్ అధ్యక్షలకు ఉపాధ్యక్షులకు పార్టీ ప్రధాన కార్యదర్శిలకు మాజీ ప్రజా ప్రతినిధులకు పార్టీ శ్రేణులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు నేను మంత్రి సీతక్క అడుగుజాడల్లో.. నడుచుకుంటూ.. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తానని అన్నారు. ఆనాడు ఏజెన్సీ ప్రాంతంలో నిర్బంధం ఉండేది కాంగ్రెస్ పార్టీ జెండాను వదలకుండా ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఎన్ని ఆటు పోటు లు వున్నకాని కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన తీరు అంతా ఇంతా కాదు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పదవులు వాటికి అంతట అవే వస్తాయి దానికి నిదర్శనం నేనే.. ప్రతి కార్యకర్త నిస్వార్థంగా పనిచేసి ఎలాంటి కల్మషం లేకుండా పార్టీ కొరకు పనిచేయాలని రానున్న స్థానిక ఎన్నికల్లో ఎంపిటిసిలు జెడ్పిటిసిలు సర్పంచులు అత్యధికంగా కైవాసం చేసుకోవాలని యొక్క విజయాన్ని గాంధీభవన్ కు కానుకగా ఇవ్వాలని సీతక్క సైనికులుగా పేరు ప్రఖ్యాతలు ప్రతి ఒక్కరం సంపాదించాలని తెలిపారు.


## 93 ఏళ్ల కురవృద్ధుడీకి న్యాయం చేయలేరా అధికారులు



**మహుబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన ఆగష్టు 3 :** తమ,భూమిని,ఆక్రమించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్న భూ కబ్జాదారుల ఆగడాలను భరించలేక ఈ నెల 12వ తేదీన స్థానిక తహసిల్దార్ ఆఫీస్ వద్ద యూసుఫ్ ఖాన్ అనే 93 ఏళ్ల కురు వృద్ధుడు ధర్నాకు,సిద్ధమవుతున్నారు.ఈ విషయమై ఈరోజు మహబూబాబాద్ లో పట్టణానికి చెందిన ముస్లింలు స్థానిక ఈద్గాలో ఆదివారం రోజున పత్రిక సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో యూసుఫ్ ఖాన్ కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన, వివిధ కమిటీలకు చెందిన,ముస్లింలు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూసుఫ్ ఖాన్ కుమారుడైన అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, జులై నెల 12వ తేదీన మండల సర్వేయర్ సర్వే ప్రకారం మా హద్దులకు మేము రాళ్లు పాతుకోగా కబ్జాదారులు తొలగించడం జరిగింది. ఈ విషయమై టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కూడా పోలీసులు నిర్లక్ష్యంతో ఉన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతో మరింతగా,కబ్జాదారులు పెట్రేగి ఆ భూమిలోకి వస్తే మిమ్మల్ని చంపేస్తామని, భూమిలోకి రానివ్వడం లేదని వారి,ఆగడాలకు, విసిగిపోయిన తన తండ్రి 93 ఏళ్ల యూసుఫ్ అలీ ఖాన్ ఈ నెల 12వ,తేదీన,స్థానిక,తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నాకు సిద్ధమవుతున్నారని అన్నారు. కంకర్ బోడు మసీద్ కు చెందిన మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్,ముస్లింలపై దౌర్జన్యాలు చేయడం మంచి పద్ధతి కాదని,ఇప్పటికైనా భూకబ్జా దారులుతమ వైఖరి మార్చుకోవాలని, ఇది ఒక కుటుంబ సమస్య కాదని, మహబూబాబాద్ లోని ప్రతి ముస్లిం సమస్య అని ఈ సమస్యను కలిసికట్టుగా ఎదుర్కొంటామని, అన్నారు.ఇస్లేహ్, మాషిర,కమిటీ, మహబూబాబాద్ అధ్యక్షులు ఎండి ఇక్బాల్,గారు,మాట్లాడుతూచాలా తేలికగా పరిష్కారం అయ్యే,సమస్యను, భూకబ్జాదారులు, జటిలం, చేసుకుంటున్నారని, యూసుఫ్ ఖాన్ కుటుంబం ఎలా సర్వే చేసుకున్నారో, పక్క వారు,కూడా, తమ, తమ,భూములకు, సర్వే, నిర్వహించు కోవడం ద్వారా సమస్య పరిష్కారం, అవుతుందని ,మహబూబాబాద్ కు చెందిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చోరవ తీసుకొని పక్క వారి భూమి కూడా సర్వే చేయడం వల్ల ఈ సమస్య అతి తేలికగా పరిష్కారం అవుతుందని, సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే గారు ఈ విషయమై సానుకూలంగా స్పందించి సమస్యను త్వరగా పరిష్కారం చేయాలని, ఈ నెల 12వ తేదీ నాడు యూసుఫ్ అలీఖాన్ ధర్నా చేయకముందే సమస్య పరిష్కారమైతే అందరికీ బాగుంటుందని, 93 ఏళ్ల కురు వృద్ధుడు తన హక్కుల కోసం ధర్నా చేయడం ముస్లిం సమాజానికి, ప్రభుత్వానికి మంచిది,కాదని,సూచించారు,ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ నాయక్, సయ్యద్ సాదిక్, నిజాం, మక్బూల్, నజీర్, అబ్దుల్ కలీం, యాఖుబ్ పాషా, ముజాఫర్, జియా, ఇంతియాజ్ ఖాన్, మహమ్మద్ అలీఖాన్, అలీమ్, ఫజల్, అన్వర్, ఫెరోజ్, అజీజ్, అజీమ్, సఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 6న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి..

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి




**నర్సంపేట తెలంగాణ సేన :** బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణ పార్టీ సన్నాక సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాయిడి రవీందర్ రెడ్డి నల్ల మనోహర్ రెడ్డి గారు, లెక్కల విద్యాసాగర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ....నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు మరియు తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న మెగా రక్తదాన శిబిరాన్నీ విజయవంతం చేయాలని పట్టణ పార్టీ ఆధ్వర్యంలో సన్నాక సమావేశం ఏర్పాటు చేయడమైనది. గత ఎనిమిది సంవత్సరాలుగా మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పుట్టినరోజు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాము అందులో భాగంగానే ఆగస్టు 6న, గ్రీన్ స్టార్ హాస్పిటల్ ఆవరణంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో నియోజకవర్గంలో గల యువకులు పెద్ద ఎత్తున పాల్గొనలని కోరారు. కరోనా లాంటి కష్టకాలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా రక్త నిల్వలను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం మరియు గవర్నర్ చేత అవార్డు అందుకున్న మనా నర్సంపేట నియోజకవర్గం యువకుల స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈనెల ఆగస్టు 6న జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు, రాజకీయ నాయకులు సామాజిక బాధ్యతతో ప్రజాసేవ చేయాలనీ సూచించారు...ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి , క్లస్టర్ బాధ్యులు,మాజీ కౌన్సిలర్లు బిఆర్టియు జిల్లా అధ్యక్షులు, అన్ని వార్డుల అధ్యక్షులు, మరియు కార్యదర్శలు, పట్టణ పార్టీ బాధ్యలు, మరియు యువకులు పాల్గొన్నారు....

## మానుకోటలో ఘనంగా గోపా స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణ



**మహుబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన ఆగష్టు 3 :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం గోపా మహబూబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ సంస్థ ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలుత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు, జిల్లాలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులు యాసారపు వెన్నెల, మారగాని సాయి లను, శాలువాలతో సత్కరించి ప్రతిభ పురస్కారాలను అందించారు అందించారు. ఈ సందర్భంగా గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్లంతా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వృద్ధిని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిక్కి వెంకటేశ్వర్లు, చీకటి శ్రీనివాస్, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్న, ఉపాధ్యక్షుడు పెద్ది వెంకన్న, గునిగంటి కమలాకర్, చిర్రా యాకాంతం, ముంజాల రాజేందర్, ఐ జేయు జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాస్, తొర్రూర్ గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, నాయకులు చీకటి అశోక్, గునిగంటి శ్రీనివాస్, గండి వీరేందర్, వేణు, తదితరులు పాల్గొన్నారుం.

## అన్నింటికన్న గొప్పది స్నేహబంధం

### నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆదివారం అంతర్జాతీయ స్నేహితులు దినోత్సవం సందర్భంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా స్నేహితుల దినోత్సవం వేడుకలు నిర్వహించారు ఒకరికి ఒకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ సందర్భంగా నాచారం దేవస్థానం డైరెక్టర్ గజ్వేల్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు,జగ్గయ్యగారి శేఖర్ మాట్లాడుతూ స్నేహానికన్న మిన్న లోకంలో ఏది లేదు అని స్నేహ బంధం గొప్పది అని అన్నారు, ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి,గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ, కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్,నేతి శ్రీనివాస్, గంగిశెట్టి వెంకటేశం,కైలాస ప్రశాంత్, ఉమేష్, రమేష్ రామారం, ఎర్రం విక్రాంత్, తెరాలరాజు, ఉప్పల కృష్ణమూర్తి,ఉమేష్, సిద్ది నవీన్, జగ్గయ్యగారి శ్రీనివాస్,గౌరీ శంకర్,ప్రసాద్, సిరిపురం, బెజగామ రాము, శంకరయ్య, సత్యనారాయణ,నాగేందర్,శంకరయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
సోమవారం 04 - 08 - 2025

# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు...

– వేములవాడ మున్సిపల్ కమిషనర్





**వేములవాడ,ఆగష్టు 03 (తెలంగాణ సేన) :** వేములవాడ పురపాలక సంఘం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిబంధనలకు అనుగుణంగా,పూర్తి పారదర్శకతతో నిర్వహించబడిందని పురపాలక సంఘం కమిషనర్ అన్వేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సిఫార్సు చేసిన లబ్ధిదారుల జాబితాను వార్డు అధికారులు పరిశీలించారు. అనంతరం, సంబంధిత కమిటీ నిబంధనల ప్రకారం మరింత సమీక్ష చేసి, అర్హతలు ఉన్న వారికి గెజిటెడ్ అధికారి ధృవీకరణ అనంతరం మంజూరులు నిర్వహించబడినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఎంపికైన లబ్ధిదారులకు శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే, %ూ%2 కేటగిరీలో అర్హత పొందిన లబ్ధిదారులకు విడతల వారీగా ఇండ్ల మంజూరులు కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు. వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా తొలగించబడిన ఇళ్ల ప్రాంతాల్లో మిగిలిపోయిన మట్టి దిబ్బలను తొలగించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ పనుల కోసం టెండర్ ప్రక్రియ ఆగష్టు 2, 2025 నుంచి ప్రారంభమై ఆగష్టు 11, 2025 వరకు టెండర్ల స్వీకరణ జరుగుతుందని వివరించారు.టెండర్ ప్రక్రియ పూర్తైన వెంటనే సంబంధిత శుభ్రత పనులు ప్రారంభించబడతాయని స్పష్టం చేశారు.పౌరుల సంక్షేమం దృష్ట్యా అన్ని కార్యక్రమాలు విధిగా, సమర్థవంతంగా చేపడుతున్నామని,ప్రభుత్వ మార్గదర్శకాలను పూర్తిగా పాటిస్తూ నిర్వాహక చర్యలు కొనసాగుతాయన్నారు.

## రాజన్న ఆలయ ప్రాంగణంలో నేషనల్ లెవెల్ 79వ ఎడిషన్ మ్యూజిక్,డాన్స్ ఫెస్టివల్

– శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం





**వేములవాడ,ఆగష్టు 03 (తెలంగాణ సేన) :** దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఓపెన్ స్లాబ్ నందు ఆదివారం రోజున శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రావణమాస శివపాద నృత్యనీరాజనం - 2025 నృత్య-సంగీత ఉత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ పవిత్ర సందర్భంలో,వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన అతిరథ మహారథ నాట్య గురువులు,కళాకారులు, తల్లిదండ్రులు,బాల కళాకారులు అలంకార ప్రదక్షిణ చేసి శ్రీవారి పాదాలకు నృత్యార్చన చేసినారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి రాధా బాయి హాజరై, కళాకారులను సన్మానించి అభినందనలు తెలిపారు.ప్రతి ఏడాదిలా, ఈసారి కూడా శ్రావణమాసం సందర్భంగా నిర్వహించే ఈ కళా యజ్ఞం భక్తులు, కళాప్రేమికులు, సందర్శకుల సమక్షంలో విశేషంగా ఆకర్షణంగా నిలిచింది.

## అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

- అక్రమ మట్టి రవాణా పై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నాలుగు ట్రాక్టర్లు,జేసిబి లు తప్పించుకున్నాయి
- వేములవాడ ఇంచార్జి ఆర్డీఓ రాధా బాయి





**వేములవాడ,ఆగష్టు 03 (తెలంగాణ సేన) :** జిల్లాలో అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజు పల్లిలో అక్రమ మట్టి రవాణా చేస్తున్న మట్టి ట్రాక్టర్లను వేములవాడ ఇంచార్జి ఆర్డిఓ రాధా బాయి సీజ్ చేయడాన్ని కలెక్టర్ అభినందించారు. ఇందిరమ్మ ఇండ్లకు పని దినాలలో ప్రభుత్వం ఇసుక,మట్టి తరలించేందుకు అనుమతులు ఇచ్చిందని, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.అక్రమ మట్టి రవాణా జరుగుతుందన్న సమాచారంతో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించగా 4 ట్రాక్టర్లు, జేసిబి లు పారి పోయాయని వేములవాడ ఇంచార్జి ఆర్డిఓ రాధా బాయి తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లకు అని బ్యానర్ తో అక్రమంగా తరలిస్తున్న మట్టి ట్రాక్టర్ ను ఆర్డిఓ సీజ్ చేశారు.జిల్లాలో ఎవరు అక్రమ ఇసుక మట్టి రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఇండ్ల పంపిణీపై బీఆర్ఎస్ మండిపాటు

- ఇందిరమ్మ కమిటీల పేరుతో లబ్ధిదారులకు కాంగ్రెస్ అన్యాయం
- వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ నాయకుల ప్రెస్ మీట్



**వేములవాడ,ఆగష్టు 03 (తెలంగాణ సేన) :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో సగానికి పైగా కాంగ్రెస్ నాయకుల బంధువులు, మద్దతుదారులకే ఇండ్లు కేటాయించారని,పారదర్శకంగా లేని ఇండ్ల పంపిణీలో ఖచ్చితంగా న్యాయపరమైన పోరాటం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణం సగంలోనే ఉండగా కేవలం రానున్న మున్సిపల్ ఓట్ల కోసం మాత్రమే పంపిణీ చేయడం సరికాదని,మీకు నిరుపేద ప్రజల పట్ల ప్రేమ అభిమానం ఉంటే నిర్మాణాలు పూర్తి చేసి ఇచ్చి ఉంటే మేము పూర్తిస్థాయిలో స్వాగతించే వాళ్ళమని,ఇండ్ల పంపిణీలో పూర్తిగా అవకతవకలు జరిగాయని అన్నారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంపిణీ జరగలేదని,అన్ని సామాజిక వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా పంచాల్సి ఉండేదని మండి పడ్డారు.అధికారులు కూడా ఇందులో తప్పులు చేశారని తప్పనిసరిగా దీనిపై సమాధానం చెప్పాల్సి ఉంటుందని,నిరుపేదల పక్షాన కచ్చితంగా నిలదీస్తామని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలనలో భాగంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా వేములవాడ పురపాలక సంఘం పరిధిలో 28- 12- 2023 నుండి 6- 01- 2024 వరకు దరఖాస్తులను స్వీకరించామని వచ్చిన దరఖాస్తులను 21- 01- 2025 నుండి నాలుగు రోజులపాటు వార్డుల వారిగా సభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను గుర్తించిన విషయం మరిచారా అని ప్రశ్నించారు.ఒక్కో వార్డులో 60 నుంచి 70 మంది లబ్ధిదారులు ఉండగా కేవలం వార్డుకు ఇందిరమ్మ కమిటీ ద్వారా ఐదుగురిని ఎంపిక చేయడం మిగతా వారిని ఎలా సర్దుబాటు చేస్తారనేది ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు.అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేకూరే విధంగా చేపట్టాల్సిన ఇండ్ల పంపిణీలో పూర్తిగా ఇందిరమ్మ కమిటీల ద్వారా చేయడం వారి సొంత ప్రయోజనాల కోసం చేసినట్లుగా ఉందని ఆరోపణ చేశారు.పురపాలక సంఘం పరిధిలో అనేకమంది నిరుపేదలు ఉంటే ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో వ్యవహరించారని,నిలిచిన 20 మాసాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో కనీసం ఒక అభివృద్ధి ఒక్కటి కూడా వేములవాడ పురపాలక సంఘం లో కనిపించడం లేదని,అభివృద్ధి పేరుతో ప్రధాన రహదారులకు కూల్చిన వాటిని కూడా 50 రోజులుగా తొలగించ లేదంటే మీ పనితనం తెలిసిపోయిందని, గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ సహకారంతో మున్సిపల్ చైర్మన్ చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ కనిపిస్తున్నాయని అన్నారు.ఇక్కడ మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, జోగిని శంకర్, ముద్రకోల వెంకటేశం, నాయకులు వాసాల శ్రీనివాస్, నీరటి మల్లేశం, కృపాల్, వెంకట్ రెడ్డి, పోతు అనిల్ కుమార్, పర్వేజ్, రాకేష్ , సాయి, రఫీక్, తదితరులు ఉన్నారు.




# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.....

- బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్



**వేములవాడ,ఆగష్టు 03 (తెలంగాణ సేన) :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల నుండి 10 శాతం ముస్లింవి తీసేయాలని,42 శాతం బీసీలకే రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ ధర్నాలో బీజేపీ నేతల డిమాండ్ చేసారని,కేంద్రం మెడలు వంచైనా, కామారెడ్డి డిక్లరేషన్ మేరకు '42 శాతం' బీసీ రిజర్వేషన్ల హామీని నెరవేర్చుతామని కాంగ్రెస్ స్పష్టం చేస్తుందని,కామారెడ్డి డిక్లరేషన్లో ప్రకటించిన మేరకు 42 శాతం చట్టబద్ధంగా, శాస్త్రీయంగా రిజర్వేషన్ల అమలుకై బీఅర్ఎస్ మరియు 'తెలంగాణ జాగృతి' డిమాండ్ చేస్తుందని పొలాస నరేందర్ అన్నారు.సామాజిక వేత్తలు,న్యాయనిపుణులు,అఖిలప క్షాన్ని,ప్రభుత్వాలను సమన్వయపరచి,బిల్లులు పెండింగ్లో, చిక్కుల్లో పడకుండా కృషికై విజ్ఞప్తి.2025 మార్చి 17 న అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదంకై పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లులు పెండింగ్లో ఉండడం,30 రోజుల్లో స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేసి,90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని 2025 జూన్ 25 న ఆదేశించడంతో,రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి పంచాయతీరాజ్ చట్టం 2018 ని సవరిస్తూ ఎన్నికలు జరుపుటకు ఆర్డినెన్స్ జారికై గవర్నర్ ఆమోదం కొరకు ప్రభుత్వంకు పంపించిన ఆర్డినెన్స్ ను, గవర్నర్ గారు న్యాయసలహా కోసం కేంద్ర హోం శాఖకు పంపడంతో , ఎన్నికల నిర్వహణకు మరింత జాప్యం జరుగుతుండడం బాధాకరమని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆమోధంకై పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులలో,ముస్లీంలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని,42 శాతం రిజర్వేషన్లలో ముస్లీంలకు కల్పించిన 10 శాతం రిజర్వేషన్లను తొలగించాలని,పూర్తి స్థాయిలో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకె కల్పించాలని డిమాండ్ చేస్తూ,రాజ్యాంగంలోని ఆర్టికల్ 243- ఈ(6)ప్రకారం బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని నిన్న హైదరాబాద్లో జరిగిన బీసీల మహాధర్నా రాష్ట్ర బీజేపీ నేతలు వారి ప్రసంగాల్లో అన్నారని నరేందర్ అన్నారు.బీసీ డిక్లరేషన్ ప్రకారం,ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని,చట్టబద్ధంగా, శాస్త్రీయంగా బీసీలకు ప్రత్యేకంగా సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని,బీసీ సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమండ్ చేస్తూ, బీఅర్ఎస్ పార్టీ ఈ నెల 8 న కరీంనగర్లో 'బీసీ గర్జన ' కార్యక్రమం చేపట్టడం జరిగింధని,ఈ నెల 4 నుండి 7 వరకు హైదరాబాద్లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై నిరాహారదీక్ష చేపట్టడం జరిగిందని,ఈ నెల 6 న ఢిల్లీలో ప్రభుత్వం,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న రిజర్వేషన్లకు ఆమోదం తెలుపాలని కేంద్రాన్ని కోరుతూ ధర్నా చేపట్టడం జరుగుతుందని అన్నారు. అఖిలపక్ష పార్టీలు,సామాజిక వేత్తలు, న్యాయనిపుణులు,మేధావి వర్గాలు ముందుకు వచ్చే సమయం ఆసన్నమైనందున, ముందుకు వచ్చి అందరినీ సమన్వయపరుస్తూ, సమిష్టిగా ప్రధానిని, రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం పొందేవరకు ఢిల్లీలోనే మకాం వేసి,కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి చట్టబద్ధంగా, శాస్త్రీయంగా బిల్లుల ఆమోదం పొందుటకు కృషి చేయాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు.

# ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి : కేటీఆర్



**కబురు న్యూస్:** ఉప ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టిన గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 50వేల మంది కార్యకర్తల సభ్యత్వం ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ నియోజకవర్గమని.. ఉప ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలువాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అధికారంలోకి వచ్చాక బస్తీల్లో ఉండే పేదల ఇండ్లు కూల్చుతున్నదని మండిపడ్డారు.

సీఎం రేవంత్ కొడంగల్ నియోజకవర్గంలో ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నాడని.. హైదరాబాద్‌లో రేవంత్, ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని.. ఇలా చెప్పుకుంటే పోతే కాంగ్రెస్ నేతల ఇండ్లన్నీ బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నాయన్నారు. కూట్లో రాయి తెయ్యలేని వాడు, ఎట్లో రాయి తీస్తా అని రేవంత్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా, మరొక్కసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. 20 నెలల కాంగ్రెస్ అసమర్థ, అవినీతి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి నేతలంతా వచ్చి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

మోసగాళ్లకు, మోసగాళ్ల పార్టీ అయిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని, రానున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని.. మళ్లీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా, ఉన్న పథకాలన్నీ పోతాయన్నారు. కాంగ్రెస్ మోసానికి తెలంగాణ ప్రజలు అంగీకరించారని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్ర సమితిని ఓడించడమేనన్నారు. అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణలో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారన్నారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులకు తాను ఒక్కటే చెబుతున్నానని.. గెలుస్తామన్న ధీమాతో నిర్లక్ష్యం వద్దని.. గెలుస్తామని ఇంట్లో ఉండకుండా ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినా మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీని వీడలేదని.. ఉపఎన్నిక గెలిచి మాగంటి గోపీనాథ్ అంకితమివ్వాలన్నారు.

## 5న కేంద్ర ఎన్నికల సంఘం సమావేశం.. హాజరు కానున్న బీఆర్ఎస్ పార్టీ బృందం




**కబురు న్యూస్, హైదరాబాద్ :** భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఢిల్లీలోని నిర్వచన్ సాధన్ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు దేశంలోని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశానికి రావాలని బీఆర్ఎస్ పార్టీని కూడా ఈసీఐ అధికారంగా ఆహ్వానించింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ బృందం హాజరు కానుంది. కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కేఆర్ సురేశ్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్, మాజీ ఎంపీ బాల్క సుమన్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరు కానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీకి ఈసీఐ కార్యదర్శి అశ్విని కుమార్ మొహాల్ ఒక అధికారిక లేఖలో కోరారు. ఈ ఆహ్వానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా బీఆర్ఎస్ అధ్యక్షుడికి కూడా పంపారు. మీడియా వర్గాల సమాచారం ప్రకారం, ఈ సమావేశంలో ఎన్నికల సంస్కరణలు, ఇప్పటికే ఈసీఐకి సమర్పించిన వివిధ అభ్యర్థనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి సంబంధిత అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పలు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.